క్లుప్తంగా

కుటుంబ సర్వే పూర్తి చేయాలి



సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

పాలసముద్రం: మండల పరిధిలోని ఎస్టీ కాలనీల్లో కుటుంబాల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్ ఎంపీడీఓ ఆదేశాల మేరకు శ్రీకావేరి రాజుపురం సమీపంలోని ఎస్టీ కాలనీల్లో కుటుంబ సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఇంజినీర్ అసిస్టెంట్ నాగరాజ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఐతో సమావేశం



సీఐని మర్యాద పూర్వకంగా కలిసిన ఆర్టీఐ ప్రతినిధులు

గంగాధరనెల్లూరు: సీఐగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణను జాతీయ సమాచార హక్కు చట్టం సంస్థ సభ్యుడు బండి పట్టాభిరెడ్డి, ఇతర నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించారు. నాయకులు డీకే కుమార్, రామ్‌రాజ్, గిరిబాబు, ఆనంద బాబు, లోకనాథం, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, త్యాగరాజరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవలో పారిశుధ్య పనులు



వీధి మలుపులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

నగరి: స్వచ్ఛతాహి సేవలో భాగంగా మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణను శుభ్రపరచి వీధి మలుపుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గజేంద్ర, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర ఎంపీడీఓగా శివప్రసాద్ వర్మ



నింద్ర: ఎంపీడీఓగా శివప్రసాద్ వర్మ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ అరుణ బదిలీపై వెళ్లిపోవడంతో వైఎస్ఆర్ జిల్లా ఉపాధి క్లస్టర్ ఏపీడీగా పని చేస్తున్న శివప్రసాద్ వర్మ ఎంపీడీఓగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

బొమ్మయ్యపల్లె సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ



గోవిందయ్య

చిత్తూరు కార్పొరేషన్: వెదురుకుప్పం మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ సర్పంచ్ చొక్కా గోవిందయ్య చెక్ పవర్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ పునరుద్ధరించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో ఉత్తర్వులు అందించినట్లు సర్పంచ్ గోవిందయ్య తెలిపారు. గతంలో పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, అభివృద్ధికి స్థానిక సర్పంచ్ ముందుకు రావడం లేదని దేవళంపేట గ్రామానికి చెందిన వార్డు మెంబర్ పయణి రెండు సార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఓ సూచనలతో కార్వేటినగరం ఎంపీడీఓ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. తరువాత సర్పంచ్ గోవిందయ్యకు షోకాజ్ నోటీస్ అందించి చెక్‌పవర్‌ను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ద్వారా గత నెల 30న ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సర్పంచ్ గోవిందయ్య జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరాలను అందించారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకూడదని హెచ్చరిస్తూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశిస్తూ చెక్ డ్రా పవర్‌ను పునరుద్ధరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వినతులు పరిష్కరించండి

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్‌కుమార్ నాయక్, మున్సిపల్ ఇంజినీరు వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చని కాపురాలను బెట్టింగ్ మహమ్మారి కూల్చేస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా ఈజీ మనీకి అలవాటు పడిన యువత బానిసలుగా మారుతున్నారు. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచాన్నే జయించవచ్చు అనే అపోహతో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. బెట్టింగ్ వెంట పరుగులు పెట్టి లక్షల్లో నగదు పోగొట్టుకుంటున్నారు. చివరకు అప్పు పాలై కుటుంబం మొత్తాన్ని నడిరోడ్డుపైకి ఈడ్చేస్తున్నారు. ఆత్మహత్యే శరణ్యంగా మారడంతో కుటుంబాలకు కుటుంబాలే కూలిపోతున్నాయి.

కూలుతున్న కాపురాలు



- ఉసురు తీస్తున్న బెట్టింగ్ మహమ్మారి
- నియోజకవర్గంలో జోరుగా బెట్టింగ్
- అప్పుల పాలవుతున్న పచ్చని కుటుంబాలు
- ఆత్మహత్యే శరణ్యంగా మారుతున్న వైనం

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని ఎగవూరు గ్రామానికి చెందిన నాగరాజురెడ్డి (65) తన కుటుంబంతో ఎంతో సంతోషంగా జీవించేవారు. అలాంటి కుటుంబంలో కుమారుడు దినేష్‌రెడ్డి (22) ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. తాతల



చిన్నాభిన్నమైన నాగరాజురెడ్డి కుటుంబం



తెలంగాణాలో మరణించిన హరీష్ కుటుంబం

నుంచి వచ్చిన ఆస్తులను కొంత అమ్మి బెట్టింగ్‌లో పెట్టాడు. అమ్మినదంతా పోగొట్టుకుని అప్పుల్లో కూరుకుపోయాడు. తర్వాత ఆన్‌లైన్ బెట్టింగ్‌లో కొంత సంపాదించాడు. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంగా మార్చుకున్నాడు. కోటి రూపాయలకు పైగా బెట్టింగ్‌లో కోల్పోయి కోలుకోలేని విధంగా అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు, దినేష్‌రెడ్డి గత గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషమ పరిస్థితుల్లో ఉన్న దినేష్‌రెడ్డి, కుటుంబ సభ్యులను బంధువులు రాణిపేట సీఎంసీకి తరలించారు. చికిత్స పొందుతూ నాగరాజురెడ్డి(65), భార్య జయంతి(50), కుమార్తె సునీత(26) మృత్యువాత పడ్డారు. బెట్టింగ్‌కు పాల్పడ్డ దినేష్‌రెడ్డి అత్యంత విషమ పరిస్థితుల్లో చికిత్స పొందుతూ మరణించాడు. బెట్టింగ్ భూతం పచ్చని కుటుంబాన్ని పొట్టన పెట్టుకుందని బంధువులు రోదిస్తున్నారు. అదేవిధంగా తెలంగాణాలోని నిజామాబాద్ వడ్డేపల్లిలో హరీష్ అనే యువకుడు 50 లక్షల రూపాయలు బెట్టింగ్‌లో పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఇలాంటి ఘటనలు కోకొల్లలు.

జూదం.. ఓ భూతం

ఆన్‌లైన్ బెట్టింగ్ పూర్తిగా నిశ్శబ్దం అయినప్పటికీ చాప కింద నీరులా పూర్తిగా విస్తరించింది. దీని కారణంగా రోజురోజుకి యువత ప్రాణాలు పోతున్నాయి. బెట్టింగ్, జూదంలో మోసపోయి అప్పుల పాలై సమాజంలో బతకలేక మరణించే వారి సంఖ్య పెరిగిపోతోంది. కొడుకు ప్రయోజకుడై కుటుంబానికి మంచి చేస్తాడని నమ్మకంతో రక్తాన్ని చెమటగా మార్చి చదివిస్తుంటే బెట్టింగ్ నిర్వాకంతో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలతో తల్లిదండ్రుల సైతం నిర్జీవమైపోతున్నారు.

బెట్టింగ్ వ్యసనం



బెట్టింగ్ ఒక వ్యసనం. ఒక్కసారి కష్టపడకుండా సంపాదించే సొమ్ముకు అలవాటు పడితే ఎంతటికైనా తెగించే స్థాయికి బెట్టింగ్ తీసుకు వెళుతుంది. మొదట్లోనే వీటిని దూరంగా పెట్టడంతో కుటుంబం పరువు పోకుండా, ప్రాణాలు కోల్పోకుండా ఉండవచ్చు. పచ్చని సంసారంలో నిప్పులు పోసే వ్యసనం బెట్టింగ్. మానసికంగా కుంగిపోకుండా దృఢ సంకల్పంతో ఒక్క నిమిషం ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుంది. యువత చెడు అలవాట్లకు బానిస కాకూడదు. – జయప్రియ, మానసిక వైద్య నిపుణురాలు, చిత్తూరు

క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోవద్దు



బెట్టింగ్, జూదం లాంటి నిషేధిత సైట్లలో డబ్బులు కోల్పోయి అప్పులు పాలై క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోవద్దు. మండలంలో ఎవరైనా జూదం, బెట్టింగ్ లాంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసుల దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంతవరకు పరిష్కారం దిశగా ముందుకు తీసుకెళ్తాం. ఒక్క క్షణంలో నిర్ణయం తీసుకుని కుటుంబాన్ని మృత్యువు పాలు చేసుకోకూడదు. – లక్ష్మీనారాయణ, సీఐ, గంగాధరనెల్లూరు

అడ్డూ అదుపూ లేని ఇసుక అక్రమ రవాణా



అక్రమంగా ఇసుకను తరలించిన ట్రాక్టర్

పాలసముద్రం : మండలంలో టీడీపీ నాయకులు అడ్డూ అదుపూ లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. మండలంలోని సన్నగుంటలో సోమవారం బీసీ కాలనీకి చెందిన టీడీపీ నేత ఇసుకను అక్రమంగా తరలించేశారు. అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గత కొద్ది రోజులుగా టీడీపీ నాయకులు ఇసుక మాఫియా అవతారమెత్తారు. ఇతర పార్టీ నాయకులు కానీ, సామాన్యులు కానీ ఇసుక తరలిస్తే వెంటనే అడ్డుకుంటున్నారు. ఎవరికి ఇసుక అవసరమైనా వాళ్ల దగ్గరే కొనాలంటూ షరతులు విధిస్తున్నారు. దీంతో పోలీసు శాఖ ఇసుక మాఫియా చేతిలో కీలుబొమ్మగా మారిపోయింది. దీన్ని అదునుగా చేసుకుని టీడీపీ నాయకులు ఇక్కడి ఇసుకను అక్రమంగా తమిళనాడుకు తరలించేస్తున్నారు. దీనిపై కార్వేటినగరం సీఐ హనుమంతప్ప స్పందిస్తూ, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను కాలువలు, వంకల నుంచి మాత్రం తరలించుకోవచ్చని చెప్పారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలోని పెద్దతయ్యూరు గ్రామానికి చెందిన సంఘ సంస్కర్త, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు ఎం.చిన్నబ్బ అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సోమవారం గ్రామంలో పర్యటించి ఎం.చిన్నబ్బ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ మంత్రి వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, మండల అధ్యక్షుడు మణి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేంద్రయ్య, ఎంపీపీ సరిత, సర్పంచ్ వరదమ్మ, ఢిల్లయ్య, దిలీప్‌రెడ్డి, నాయకులు జనార్దన్, బాబు, భూపతిరెడ్డి, అల్లిముత్తు, లోకయ్య, మణి, ముత్యాలు, మహేష్, అమృతరాజ్, జయ, దొరస్వామి, రాజ, ఆనంద్, దళిత నాయకులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవింద భక్తులకు భారీ అన్నదానం



ఆలయంలో భజనలు



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

నగరి: ఓంశక్తి ఆలయం వద్ద తమిళనాడు ఓచ్చేరి నుంచి విచ్చేసిన 750 మంది గోవింద భక్తులకు పలువురు దాతలు సోమవారం అన్నదానం చేశారు. దీంతో ఓంశక్తి ఆలయ ఆవరణతోపాటు రహదారి కూడా గోవింద భక్తులతో నిండిపోయింది. ఆలయంలో గోవింద భజనలు మిన్నంటాయి. 13 ఏళ్లుగా భారీ ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దాతలు తెలిపారు. దాతలు ఆరుముగం, పెరుమాళ్, సుబ్రమణ్యం, జయచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్,కుమార్, దయానిధి, చంద్రారెడ్డి, మునికృష్ణారెడ్డి, ఎల్లప్పరెడ్డి, వేలు, రామ్‌మోహన్, కృపానిధి, అశోక్, రామ్మూర్తి, పొన్నురంగం, దేవా, మురళీమోహన్, బాలాజీ, జగన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన తారురోడ్డు



తారురోడ్డుపై కింద పడిన ద్విచక్ర వాహనం

విజయపురం: గంగమాంబపురం నుంచి మంగళకండ్రిగ వెళ్లే తారురోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఓ ప్రైవేటు సంస్థ కేబుల్ వేయడానికి జేసీబీతో రోడ్డు పక్కన గుంతలు తవ్వి మట్టిని తీసి రోడ్డుపై వేశారు. తారురోడ్డుపై వేసిన మట్టి చెల్లాచెదురుగా పడిపోవడంతో ద్విచక్ర వాహన దారులకు ప్రమాదకరంగా మారింది. తారురోడ్డుపై ఉన్న మట్టి నీటి సాయంతో శుభ్రం చేయాల్సిన కాంట్రాక్టర్ వాటిని అలాగే వదిలిపెట్టారని, దీంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు కూడా ప్రైవేటు కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారే తప్పా.. ప్రజల ప్రాణాలను లెక్క చేయడం లేదని వాహనదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తారురోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నగరి: శక్తిస్వరూపిణిగా ఒన్నూరమ్మ శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా దేశమ్మ, స్కందమాత అలంకరణలో అన్నపూర్ణేశ్వరి దేవి ఊరేగింపు, గౌరీ అలంకరణలో కామాక్షీ దేవి, త్రిశూలధారిగా ఓంశక్తి











ముక్తి ప్రదాయినీ.. నమోస్తుతే...

నగరి: నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు సోమవారం నవరాత్రి ఉత్సవాలతో కళకళలాడాయి. బుగ్గ అగ్రహారం ఒన్నూరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా అమ్మవారు శక్తిస్వరూపిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఉత్సవాలకు కుమారస్వామి ఉభయదారుగా వ్యవహరించగా సర్పంచ్ రవికుమార్, స్థానిక భక్తులు పాల్గొన్నారు. నేత్రప్రదాయిని దేశమ్మ దేవత లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణ పరిధిలోని కరకంటేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవికి గౌరీ అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవిని స్కందమాతగా అలంకరించారు. అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయాన్ని వేపాకులు, పూలదండలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారిని త్రిశూల ధారిగా అలంకరించారు.

పుత్తూరులో..

పుత్తూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం గ్రామదేవత ఆరేటమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

వడమాలపేటలో..

వడమాలపేట: కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారు బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, అగ్ని హోమం, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పూడి క్రాస్ వద్ద అంకాళమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



గంగాధరనెల్లూరు: అల్లిఎల్లమ్మ తల్లి ఉత్సవ మూర్తి

కార్వేటినగరంలో...

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం శ్రీబంగారమ్మ గాయత్రీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులైన నవీన, శ్రీనివాస దినేష్ కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై భక్తులు పాల్గొన్నారు.

బాట గంగమ్మకు ప్రత్యేక పూజలు

మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో సంత గేటు సమీపంలో వెలసి ఉన్న శ్రీబాటగంగమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారు గాయత్రీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

పాలసముద్రంలో...

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవిటి గంగమ్మకు, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మ, తమిళనాడు సరిహద్దుల్లోని నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరి సమేత గంగాధరేశ్వర ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. సోమవారం అమ్మవార్లను వివిధ రకాలుగా అలంకరించి విశేష పూజలు చేశారు. చెవిటి గంగమ్మను వివిధ సుగంధ పుష్పాలతో, పడవేటమ్మతల్లి సరస్వతి, గిరిరాజ కన్యకా పరమేశ్వరి దేవిని కామాక్షిదేవి, పార్వతిదేవిని గాయత్రిదేవిగా అలంకరించి, దర్శన భాగ్యం కల్పించారు.

వెదురుకుప్పంలో...

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో ఐదో రోజు సోమవారం మహా చండీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలో భక్తిప్రపత్తులతో అభిషేకాలు చేశారు. అనంతరం పట్టు పీతాంబరాలు వెండి తొడుగులతో కూడిన ఆభరణాలతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తులు ప్రసాదాలు పంచి పెట్టారు.

సంతాన లక్ష్మిగా అల్లిఎల్లమ్మ

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీఅల్లి ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో ఐదో రోజు సోమవారం అమ్మవారు సంతాన లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు ఆనంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీడీ నెల్లూరు గ్రామానికి చెందిన జ్ఞానేంద్రాచారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గాయత్రి దేవి అవతారంలో పల్లకిపై ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు పార్థసారథి రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు గుణశేఖర్‌రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

శ్రీగాయత్రీ దేవిగా అమ్మవారు

శ్రీరంగరాజపురం: ఆరిమాకులపల్లిలోని ఆరిమాను గంగమ్మ ఆలయంలో వేడుకలకు తయ్యూరు, చిన్నతయ్యూరు, పెద్దతయ్యూరు, 50 బసివిరెడ్డిపల్లి, గల్లఇండ్లు గ్రామాలవారు ఉభయదారులుగా వ్యవ హరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు శ్రీగాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నింద్రలో...

నింద్ర: కేఆర్‌పాళెం గ్రామంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రులు వేడుకగా సాగుతున్నాయి. సోమవారం లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.















పుత్తూరు: బాలా త్రిపురసుందరిగా కన్యకాపరమేశ్వరి, కార్వేటినగరం: గాయత్రీదేవీ అలంకరణలో శ్రీబంగారమ్మ, పాలసముద్రం: లలితాదేవి అలంకరణలో పడవేటమ్మతల్లి, వెదురుకుప్పం: మహాచండీ దేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు, గంగాధరనెల్లూరు: సంతాన లక్ష్మీ దేవిగా అల్లిఎల్లమ్మ తల్లి, శ్రీరంగరాజపురం: ఊరేగుతున్న అమ్మవారు, నింద్ర: లలితా త్రిపుర సుందరీ దేవిగా మహాలక్ష్మి అమ్మవారు